క్లుప్తంగా

12న ఉచిత వైద్య శిబిరం

కౌటాల: మండల కేంద్రంలోని నజరేత్ మిషన్ ప్రైవేట్ ఆసుపత్రిలో ఈ నెల 12న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు స్టీవెన్ సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9866877211లో సంప్రదించాలని కోరారు.

పాఠశాల పరిశీలన

పెంచికల్‌పేట్: మండలంలోని లోడుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం మండల ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారి యాదగిరి పరిశీలించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు టీఎల్ఎం సహాయంతో పాఠాలు బోధించాలని సూచించారు. ఆయన వెంట హెచ్‌ఎం గణేష్ ఉన్నారు.

ఎంపీడీవో బదిలీ

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న మహేందర్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మహేందర్‌ను రెబ్బెన మండల ఎంపీడీవోగా నియమించగా, కౌటాల ఎంపీవో సుధాకర్ రెడ్డికి చింతలమానెపల్లి మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు.

కోనో కార్పస్ చెట్లు వెంటనే తొలగించాలి

రెబ్బెన: ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కోనో కార్పస్ మొక్కలను వెంటనే పల్లె ప్రకృతివనం నుంచి తొలగించాలని డీవైఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం అన్నారు. సోమవారం రాంపూర్ పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి శివ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

తిర్యాణి: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి గణపతి ఆలయ 6వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆలయంలో కమిటీ సభ్యులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మార్క శంకర్ గౌడ్, అన్నం శ్రీకాంత్, జంగోని అశోక్ గౌడ్, మేన రాజు, పున్నం హరీష్ కుమార్, యాంసాని రాజు తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కెరమెరి: కేంద్రప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఎస్.వెంకట్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న కాలంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలంటే ఇప్పటినుంచే కష్టపడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, శ్రీకాంత్, చందూనాయక్, సంగెం వేణుగోపాల్, రాథోడ్ సాగర్, గోపి పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత యోగా శిబిరం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సాయిబాబా మందిర ప్రాంగణంలో మంగళవారం నుంచి పతంజలి యువ భారత్ -తెలంగాణ, జిల్లా హిందూ వాహిని ఆధ్వర్యంలో ఉచిత యోగా శిబిరం నిర్వహిస్తున్నట్లు యోగాచార్య అశోక్ ఆర్య సోమవారం తెలిపారు. వారం రోజుల పాటు నిర్వహించే శిబిరంలో ప్రతీరోజు ఉదయం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు యోగ, వ్యాయామం, ప్రాణాయామం, ఆసన ధ్యాన శిబిరం ఉంటుందని, దీని వల్ల సకల వ్యాధులు దూరమవుతాయన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీవీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

రెబ్బెన: గత పదేళ్లుగా సింగరేణిలో విద్యా వలంటీర్లుగా పని చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. సోమవారం బెల్లంపల్లి ఏరియా ఎస్‌వోటూజీఎం గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అందించాలన్నారు. ఇందిరానగర్, సాలెగూడ, డోర్లి, గిన్నెధరి, రాంబాయిగూడ, కేస్లాపూర్, చోపిడి, దంతన్‌పలి గ్రామాల్లో పని చేస్తున్న వీవీలు పాల్గొన్నారు.

పిచ్చికుక్కల దాడిలో ఒకరికి గాయాలు

బెజ్జూర్: పిచ్చికుక్కల దాడిలో ఒకరికి గాయాలైన ఘటన మండలంలోని ఎలుకపెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అరుణ్ అనే బాలుడు సోమవారం రోడ్డుపై ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా కుక్కలు దాడికి పాల్పడ్డాయి. దీంతో ఆ బాలుడికి గాయాలయ్యాయి. విషయాన్ని గమనించిన గ్రామస్తులు చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కాగా రోజురోజుకు గ్రామాల్లో కుక్కల బెడద పెరిగిపోతుందని, గ్రామపంచాయతీ అధికారులు కల్పించుకొని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రాగిపాటి ఒర్రె దాటేదెలా..?

- వంతెన నిర్మించాలని డిమాండ్
- అవస్థలు పడుతున్న ప్రజలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని జగన్నాథపూర్ గ్రామ శివారులో గల రాగిపాటి ఒర్రెపై వంతెన లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒర్రెలో నిత్యం నీరు ఉండటంతో దాటేందుకు అవస్థలు పడుతున్నారు. కాగజ్‌నగర్ మండలంలోని బోరిగాం, భీమిని మండలంలోని కర్జిభీంపూర్, లక్ష్మీపూర్, భీమిని, బిట్‌వెల్లి, రాంపూర్, మల్లీడు, దుబ్బగూడ, వడాల గ్రామాల ప్రజలు ప్రతినిత్యం ఈ మార్గం గుండానే కాగజ్‌నగర్‌కు వస్తుంటారు. కాగజ్‌నగర్ పట్టణానికి ప్రతిరోజు విద్యార్థులు, ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే కార్మికులు, పాల వ్యాపారులు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి, జగన్నాథ్‌పూర్ గ్రామాల రైతులకు చెందిన భూములు ఈ ఒర్రె అవతలి వైపున ఉండటంతో రైతులు వర్షాకాలంలో ఒర్రె దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

బురదమయంగా రోడ్డు

జగన్నాథ్‌పూర్ నుంచి కర్జిభీంపూర్ వరకు 6 కిలోమీటర్ల మేర గుంతలమయంగా ఉండటంతో వర్షాకాలంలో తీవ్ర అవస్థలకు గురికావాల్సి వస్తుంది. వర్షాకాలంలో వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఈ వంతెనపై వంతెన నిర్మించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఒర్రెపై వంతెన నిర్మించడంతో పాటు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



జగన్నాథపూర్ గ్రామం వద్ద గల రాగిపాటి ఒర్రె

ఇబ్బంది పడుతున్నాం



మాకు ఏ చిన్న పని ఉన్నా కాగజ్‌నగర్ పట్టణానికే వస్తుంటాం. ఒర్రెపై వంతెన లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. బెల్లంపల్లి కంటే కాగజ్‌నగర్ దగ్గరగా ఉండటంతో ఇక్కడికే వస్తాం. రవాణా సౌకర్యం లేకపోవడంతో అవస్థలు పడుతున్నాం.

- దుర్గయ్య, అక్కల్లపల్లి

వంతెన నిర్మించాలి



జగన్నాథ్‌పూర్ నుంచి కర్జిభీంపూర్ వరకు మట్టిరోడ్డు ఉండటంతో వర్షాకాలం బురదమయంగా మారుతుంది. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ఒర్రెలో నుంచి వాహనాలను తీయాల్సి రావడంతో వాహనాలు త్వరగా మరమ్మతులకు గురవుతున్నాయి. ఒర్రెపై వంతెన నిర్మించాలి.

- అంజి, కర్జిభీంపూర్

ముగిసిన గంగాపూర్ జాతర

రెబ్బెన: గంగాపూర్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ జాతర సోమవారంతో ముగిసింది. మూడో రోజు సైతం పలు ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో వెలిసిన దుకాణాలు, రంగుల రాట్నాల వద్ద భక్తుల సందడి నెలకొంది. సీఐ అల్లం నరేందర్, రెబ్బెన ఎస్సై భూమేశ్, తిర్యాణి ఎస్సై సీహెచ్ రమేష్‌లు జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పర్యవేక్షించారు. మూడు రోజుల జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా, ప్రశాంత వాతావరణంలో ముగియటంతో పోలీసు సిబ్బందితో పాటు ఆలయ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సుమారు 2.5లక్షలు పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు అంచనా వేశారు.

స్వామి వారిని దర్శించుకున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ సతీమణి

గంగాపూర్ జాతర మహోత్సవంలో భాగంగా చివరి రోజు ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సతీమణి శ్రీజ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, ఈవో కలెక్టర్ సతీమణికి స్వాగతం పలికి, శాలువాతో సన్మానించి స్వామి వారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు.



స్వామి వారి ఆలయంలో కలెక్టర్ సతీమణి

జంగుబాయి సన్నిధిలో 'దేవుళ్ల పున్నక్'

కెరమెరి: తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని మహరాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి ఆలయంలో 'దేవుళ్ల పున్నక్'(దేవుళ్ల పౌర్ణమి)ని ఆదివాసీలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గోండి ధర్మ సంస్కృతి సంరక్షణ సమితి జంగో, లింగో ఘన్ సంస్థాన్ ఆధ్వర్యంలో రాయితాడ్ జంగుబాయి మహల్‌ను దర్శించుకున్నారు. అనంతరం పవిత్ర జలాలు, దేవుళ్లతో వచ్చి మర్రి చెట్టుకు పూజల అనంతరం రావుడ్, పోచమ్మకు, మైసమ్మకు పూజలు చేశారు. జంగోలింగో సంస్థాన్ పీఠాధిపతి కుమరం భగవంతరావు, గోండి ధర్మ సంస్కృతి నాయకులు ఆత్రం రఘునాథ్, పెందోర్ ప్రభాకర్, పుర్క బాపురావు, కుమ్ర కోటేశ్వర్, ఆడ శంభు, మడావి లచ్చిరాం, మంగం విశంరావు, సీతారాం తదితరులు ఉన్నారు.



రావుడ్స్‌లకు పూజలు చేస్తున్న భక్తులు

కార్మికుల హక్కుల సంరక్షణకు బీఎంఎస్ పోరాటం

రెబ్బెన: సింగరేణి కార్మికుల హక్కుల సంరక్షణ, సంస్థ పరిరక్షణ కోసం బీఎంఎస్ పోరాడుతుందని బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, జేబీసీసీఐ సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం గోలేటిలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఎంఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత వేతన ఒప్పందంలో మాదిరిగా మెడికల్ స్కీం, పెన్షన్, క్యాడర్ స్కీం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వంటి వాటిని త్వరలో జరిగే జేబీసీసీఐ సమావేశంలో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ముందుగా గోలేటి టౌన్‌షిప్‌లో బీఎంఎస్ ర్యాలీ నిర్వహించి 19శాతం మినిమం గ్యారెంటిడ్ బెనిఫిట్స్ సాధించినందుకు సంబరాలు చేసుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి పవన్, వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేష్, ఏబీకేఎంఎస్ కార్యదర్శి మాధవనాయక్, జాతీయ కార్యవర్గ సభ్యులు రమాకాంత్, నాయకులు తాళ్లపెల్లి రాములు, శ్రీనివాసరావు, తిరుపతి, ఏరియా ఉపాధ్యక్షుడు అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి

30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం నజ్రూల్ నగర్ విలేజ్ నం.12 గ్రామంలో 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సిద్దిక్, డెప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం, మాజీ జెడ్పీటీసీ మౌల్కార్ లక్ష్మణ్, ఎంపీటీసీ అమిత్‌దాస్, సర్పంచ్ లక్ష్మిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు

శివాలయంలో కోవ లక్ష్మి పూజలు



వాంకిడి: కేక్ కట్ చేస్తున్న అజయ్‌కుమార్



కెరమెరి: శివునికి పూజలు చేస్తున్న కోవ లక్ష్మి

కెరమెరి: మండల కేంద్రంలోని శివాలయంలో సోమవారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవ లక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు. ఆమె జన్మదినం సందర్భంగా శివునికి, లింగానికి, ఆంజనేయ స్వామికి అర్చకుడు కులకర్ణి బాపూదేవ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, ఎంపీపీ పెందోర్ మోతిరాం ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు జరిపారు. సర్పంచులు బైనాబాయి, న్యానేశ్వర్, జగన్నాథ్‌రావు, ఉపసర్పంచ్ నిసార్, నాయకులు ఉత్తం నాయక్, యూనూస్, సెండే నారాయణ, సెడ్మకి అమృత్‌రావు, జగన్ కేంద్రె, బాలాజి కేంద్రె, కదం శంకర్, రఘునాథ్, శ్రీనివాస్, మారుతి, నాగు ఉన్నారు.

రోడ్డు మంజూరు చేయండి

శివాలయానికి వెళ్లేందుకు ప్రత్యేక రోడ్డు మంజూరు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోవ లక్ష్మిని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు సెండే నారాయణ, కేంద్రె జగన్, కదం శంకర్ మాట్లాడుతూ ప్రధాన రోడ్డు నుంచి శివాలయానికి దారిలేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి తదితరులు ఉన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి జన్మదిన వేడుకలను సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జబోరె పెంటు, సరాండి సర్పంచ్ కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో..

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి జన్మదిన వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1977 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. బోనగిరి సతీష్‌బాబు, ప్రమోద్, ఉమేష్, పాల్గొన్నారు.

సర్పంచ్ కుర్చీలో వారసుడు!

కాగజ్‌నగర్‌రూరల్: సర్పంచ్ కుర్చి అంటే కొందరు ప్రజాప్రతినిధులకు పరిహాసంగా మారింది. ఇప్పటికే అధికారిక కార్యక్రమాల్లో మహిళా సర్పంచ్‌లకు బదులుగా వారి భర్తలు, కుమారులు, బంధువులు పెత్తనం చెలాయిస్తున్నట్లు ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. కాగా కాగజ్‌నగర్ మండలంలోని భట్‌పల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ఉమారాణి గ్రామ పంచాయతీలోని తన కుర్చీలో కొడుకును కూర్చోబెట్టడం, అందుకు సంబంధించిన ఫొటోను ఆమె భర్త వాట్సాప్ స్టేటస్ పెట్టడం వివాదాస్పదమైంది. అధికారిక కుర్చీలో కొడుకును కూర్చోబెట్టడం ఏంటని స్థానికులు విమర్శిస్తున్నారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

ఆసిఫాబాద్‌అర్బన్: శాంతి భద్రతల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా జనవరి 31 నుంచి ఈనెల 28వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని ఎస్పీ కె. సురేష్ కుమార్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో సబ్ డివిజనల్ పోలీసు అధికారి, ఇతర ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించరాదన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ

గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు

బెజ్జూర్: గుడుంబా తయారీతో పాటు అమ్మకాలు చట్టరీత్యా నేరమని, తయారీ, అమ్మకాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బెజ్జూర్ మండల ఎస్సై వెంకటేష్ తెలిపారు. మండలంలోని కోర్తేగూడ గ్రామంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువత చదువుతోపాటు క్రీడల్లో సైతం రాణించాలని పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

వాలీబాల్ కిట్ పంపిణీ

పెంచికల్‌పేట్: మండలంలోని గొంట్లపేట్ గ్రామానికి చెందిన యువకులకు సోమవారం ఎస్సై విజయ్‌కుమార్ వాలీబాల్ కిట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువత చదువుపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. చదువుతో పాటు ఆటపాటల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సర్పంచ్ దాసరి చంద్రమౌళి, యువకులు పాల్గొన్నారు.

మహిళలకు స్వయం నిర్ణయాధికారం రావాలి

ఆసిఫాబాద్‌రూరల్: మహిళలకు స్వయం నిర్ణయం తీసుకునే అధికారం రావాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ అన్నారు. సోమవారం జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళ స్వయం నిర్ణయం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంఘం నాయకురాలు జ్యోతి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, వైష్ణవి తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలి

ఆసిఫాబాద్: మధ్యాహ్న భోజన కార్మికులకు గతేడాది మార్చిలో ప్రకటించిన వేతనం వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముంజం శ్రీనివాస్, అల్లూరి లోకేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సోమవారం కార్మికులతో కలిసి ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ వేతనం పెంచుతున్నట్లు జీవో విడుదల చేసిన ప్రభుత్వం అమలు చేయడంలో కాలయాపన చేస్తుందన్నారు. సంఘం నాయకులు కృష్ణమాచారి, జిల్లా అధ్యక్షురాలు శారద, రూప, విజయ, విమల, లక్ష్మి, కమల, భీమ్‌రావు, తుకారాం, సుజాత, సాయమ్మ, నాగలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

దూడలకు టీకాలు వేయించాలి

కౌటాల: పశువుల దూడలకు రైతులు టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి ఎస్. శ్రీకాంత్ అన్నారు. కౌటాల పశువైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని సాండ్‌గాం గ్రామంలో దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. సర్పంచ్ ఎకోన్‌కార్ దామోదర్, సిబ్బంది రాజన్న, బిక్షపతి పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక వరి గడ్డివాము దగ్ధం అయింది. మండల కేంద్రానికి చెందిన రైతు బల్దారపు రాజన్న వ్యవసాయ భూమిలో ఉన్న గడ్డివామును గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో ప్రమాదం జరిగినట్లు రైతు వాపోయాడు. ఈమేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నాడు. ప్రమాదంలో సుమారు రూ. 15వేల ఆస్తినష్టం సంభవించినట్లు రైతు తెలిపాడు.

'హాథ్ సే హాథ్ జోడో' యాత్ర ప్రారంభం

కెరమెరి: మండలంలో సోమవారం 'హాథ్ జే హాథ్ జోడో' యాత్ర ప్రారంభమైంది. సుల్తాన్‌గూడ, సాంగ్వి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఆత్రం కుసుంబ్‌రావు, పార్టీ నాయకులు జెండా ఎగురవేసి యాత్ర ప్రారంభించారు. నాయకులు సుదర్శన్, బాపూరావు, రాథోడ్ శంకర్‌నాయక్, శంకర్, రౌఫ్, జలపతి తదితరులు ఉన్నారు.

పోరాటల ఫలితమే వేతనాల పెంపు

కౌటాల: పోరాటల ఫలితంగానే మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను ప్రభుత్వం పెంచిందని సీఐటీయూ జిల్లా నాయకులు క్రిష్ణమాచారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు సంబరాలు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు శారద, నాయకులు లక్ష్మి, తార, నిర్మల, మాయ, నిరంజన, సింధుబాయి, పోశక్క, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి డిగ్రీ పరీక్షలు

కాగజ్‌నగర్‌టౌన్: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న రెగ్యులర్ విద్యార్థులకు ఈ నెల 9 నుంచి మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మినరసింహం తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారులు ఇప్పటికే టైం టేబుల్ విడుదల చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని సూచించారు.

పత్తికి రూ.15వేలు చెల్లించాలి

కాగజ్‌నగర్‌టౌన్: పత్తి క్వింటాలుకు రూ.15వేల ధర చెల్లించాలని రైతు, బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఈమేరకు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పండించిన పత్తి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో కౌలు, సన్నకారు రైతులు ఇంట్లోనే పత్తి నిల్వ చేసుకుంటున్నారని తెలిపారు. దీంతో అగ్ని ప్రమాదాలు జరిగి నష్టం సంభవిస్తుందని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చొరువ తీసుకొని రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా బీసీ సంఘం నాయకులు గజ్జెల లక్ష్మణ్, అందవెల్లి సర్పంచ్ మేకర్తి గంగన్న, ఒడ్నాల సురేందర్, ఎమ్మజీ మహేష్, పుల్ల శ్రీకాంత్, మాదాసు కిరణ్, పుల్ల శంకర్, మాలి సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు, రైతు సంఘాల నాయకులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మద్దతు ధర చెల్లించాలని రైతుల ధర్నా

సిర్పూర్(టి): రైతులు పండించిన పంటలకు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని రైతులు, వివిధ పార్టీల నాయకులు ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో సిర్పూర్(టి) -కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై రైతులు, నాయకులు మద్దతుధర చెల్లించాలని ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ పత్తికి కనీసం రూ.15వేల మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా బస్టాండ్ ప్రాంతం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు చేరుకుని తహసీల్దార్ జమీర్ హుస్సేన్‌కు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.



ధర్నా చేస్తున్న రైతులు, వివిధ పార్టీల నాయకులు

యువత క్రీడల్లో రాణించాలి

కౌటాల: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. సోమవారం మండలంలోని తాటిపల్లి గ్రామంలో కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలతో మానసికోల్లాసం, స్నేహభావం పెరుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ. 15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ. 5వేలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సోయం సురేష్, ఉప సర్పంచ్ నితీష్, ఎంపీటీసీ వనిత, బొమ్మకంటి మనీష్, నాయకులు నాందేవ్, రాందాస్, ఆనంద్ రావ్, ఎల్ములే దత్తు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

'సీఎం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం'

ఆసిఫాబాద్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిని సీఎం కేసీఆర్ మహారాష్ట్రకు ఇస్తానని చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ బుక్యా గోవింద్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు తెలంగాణ ప్రజల ఆస్తి అన్నారు. కేసీఆర్ మ్యానిఫెస్టోలోని ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు.

మోతుగూడలో కబడ్డీ పోటీలు ప్రారంభం

ఆసిఫాబాద్‌రూరల్: మోతుగూడ యూత్ కబడ్డీ పోటీలను సోమవారం సర్పంచ్ సువర్ణ, ఉపసర్పంచ్ రజితలు ప్రారంభించారు. మండలంలోని మోతుగూడ గ్రామంలో యూత్ సొసైటీ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలకు వివిధ మండలాల నుంచి 22 జట్లు పాల్గొననున్నాయి. ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5001 అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో యూత్ సొసైటీ సభ్యులు వినోద్, జానకీరాం, శ్రీనివాస్, మహేష్, మురళి, చరణ్, సాయి, రాందాస్, కల్యాణ్ తదితరులు ఉన్నారు.



ప్రారంభిస్తున్న నిర్వాహకులు